# వెతలు తీరేదెన్నడు?


తాటిడవులు గ్రామం

తాటిడవులు గ్రామానికి కనీస సౌకర్యాలు కరువు

అధ్వాన రహదారితో ఇక్కట్లు

పట్టించుకోని అధికారులు

స్థానికుల అవస్థలు


తాటిడవులు గ్రామానికి వెళ్లేందుకు రహదారి ఇదే

**చింతపల్లి:** మండలంలో తాటిడవులు గ్రామానికి కనీస సౌకర్యాలు లేకపోవడంతో స్థానిక ఆదివాసీలు నానా ఇబ్బందులు పడుతున్నారు. కుడుమసారి పంచాయతీ పరిధిలో గల ఈ మారుమూల గ్రామం ఏర్పడి దశాబ్దాలు కావస్తున్నా నేటికి రహదారి, తాగునీరు, పాఠశాల వంటి కనీస సౌకర్యాలు లేక స్థానికులు అనేక అవస్థలు పడుతున్నారు. గ్రామంలో పోడు వ్యవసాయమే జీవనాధారంగా చేసుకొని జీవనం కొనసాగిస్తున్నారు. గ్రామంలో సుమారు 20 కుటుంబాలకు చెందిన 120 మంది ఆదివాసీలు కొండకోనలు నివసిస్తున్నారు. చింతపల్లి, జి మాడుగుల సరిహద్దులో ఉన్న గ్రామానికి ఏ ప్రతి చిన్న అవసరానికైనా అన్నవరం, చింతపల్లి వారపు సంతలకు కాలినడకన రావల్సిందే. కుడుముసారి పంచాయితీ కేంద్రం మీదుగా తూరుబొంగులు గ్రామం వరకూ తారు రోడ్డు సౌకర్యం ఉంది. అక్కడి నుంచి ఈ గ్రామానికి వెళ్లాలంటే కాలినడకే శరణ్యం. ప్రభుత్వం అందించే రేషన్ సరుకులకు ప్రతి నెల గ్రామం నుంచి తూరుబొంగులు గ్రామానికి వెళ్లి తీసుకోవలిసిన దుస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. గ్రామంలో గతంలో తాగునీటి సౌకర్యం కొరకు గ్రావిటీ పథకాన్ని ఏర్పాటు చేశారు. అది ప్రస్తుతం శిథిలస్థితికి చేరుకుంది. గ్రామం ఏర్పడిన నాటి నుంచి ప్రభుత్వ పరంగా ఎటువంటి గృహ నిర్మాణాలు, పాఠశాలు భవనం గాని చేపట్టిన పరిస్థితి లేకుండా పోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామానికి పూర్తిస్థాయి రహదాకి సౌకర్యం లేక పోవడంతో ఏ అభివృద్ధి కార్యక్రమానికి తావులేకుండా పోతుందని ఆ గ్రామస్తులు వాపోతున్నారు.ఈ గ్రామంతో పాటు చింతపల్లి జిమాడుగుల మండలాల సరిహద్దులో కనీస సౌకర్యాలు లేని గడ్డిబంద, కరకపల్లి, గొప్పుగుడిసెలు, వందనాపల్లి, గొడుగుమామిడి, మూలవీధి, మండిపల్లి, చినలువ్వాసింగి, కిల్లోపల్లి, ఏస్తలు, అలగం, కంబరిగొయ్యి, చిలకలపాలెం, బురదమామిడి, వంద్రంగిపాడు తదితర గ్రామాలు ఉన్నాయి.

### పూరిపాకే పాఠశాల భవనం

గ్రామంలో పాఠశాల ఏర్పాటుచేసి రెండు దశాబ్దాలు కావస్తున్నా నేటికి భవనం లేక స్థానికులు ఏర్పాటు చేసిన చిన్న పూరిపాకలేనే పాఠాలు బోధించాల్సిన పరిస్థితి. పాఠశాల భవనం లేక తమ పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. గ్రామానికి సమీపంలోనే కొండపై దొరికే గడ్డితో చిన్న పాకను నిర్మించారు. దానిలోనే ఉపాధ్యాయుడు పిల్లలకు పాఠాలను బోధిస్తున్నారు.


పాఠశాల వద్ద చిన్నారులు

### రహదారి సౌకర్యం కల్పించండి



మా గ్రామానికి రహదారి సౌకర్యం లేక నానా ఇబ్బందులు పడుతున్నాం.ఏ వస్తువు తీసుకురావడానికి కుదరడంలేదు.నిత్యావసర సరుకులు తెచ్చుకోవడానికి కిలో మీటర్లు దూరం కాలినడకన వెళ్లవలసి వస్తుంది.అధికారులు స్పందించి గ్రామానికి రహదారి సౌకర్యం కల్పిస్తే రుణపడి ఉంటాం.

– పాంగి సోమరాజు, తాటిడవులు గ్రామం


### అధికారులు స్పందించాలి



గ్రామంలో తాగునీరు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నాం. అదే విధంగా పిల్లలకు పాఠశాల భవనం లేక చిన్న పూరిపాకలో విద్యనభ్యసిస్తున్నారు. గ్రామం ఏర్పడి దశాబ్దాలు కావస్తున్న గ్రామ సమస్యలు ఏ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా స్పందించాలి.

– వంతల బొంజుబాబు, తాటిడవులు గ్రామం

## పర్యాటక ప్రాంతాలకు సందర్శకుల తాకిడి


చాపరాయి వద్ద పర్యాటకులు

సందర్శకులతో కిటకిటలాడిన చాపరాయి, అరకు పైనరి



అరకు పైనరి వద్ద పర్యాటకుల సందడి


చెరువులవేనం వ్యూపాయింట్ వద్ద పర్యాటకులు

**డుంబ్రిగుడ:** సంక్రాంతి సెలవుల చివరి శని, ఆదివారం కావడంతో మన్య ప్రాంతంలోని పర్యాటక ప్రదేశలకు మైదాన ప్రాంతం పర్యాటకులు అధిక సంఖ్యలో చాపరాయి జలవిహారిలో, పైనరిలో తరలివచ్చారు. దాంతో సందడి నెలకొంది. మండలంలోని పర్యాటక కేందాలు చాపరాయి జలవిహారి, అంజోడలోని అరకు పైనరీ వద్ద పర్యాటకుల చేరి సందడి చేశారు. ఈవారం సంక్రాంతి సెలవులు చివరి శని, ఆదివారలు కావడంతో అధిక సంఖ్యలో పర్యాటకులు చేరి సందడి చేస్తున్నారు. చాపరాయి వద్ద స్నానాలు చేస్తు ఎంతో ఉల్లాసంగా గడిపారు. గిరిజన సంప్రదాయక థింస్సా నృత్యలతో పాటు గిరిజన వస్త్ర వేషదారణ చేస్తు పర్యాటకులు ఆనందించారు. ఫోటోలు దిగుతు ఉల్లసంగా గడుపుతు సంక్రాంతి సెలవుల వీకేంట్‌ను ఎంజాయి చేశారు.

**చింతపల్లి:** ఆంధ్రా కాశ్మీర్‌గా పేరొందిన లంబసింగిలో పర్యాటకులు తాకిడితో సందడి వాతవరణం నెలకొంది. వాతావరణ మార్పులతో గడిచిన రెండు రోజులుగా ఈ ప్రాంతంలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో పర్యాటకులు రద్దీ పెరిగింది. ఆదివారం తెల్లవారు నుంచి కుటుంబాలతో లంబసింగి చేరుకొని మంచు అందాలను, ప్రకృతి సోయగాలను ఆశ్వాదించారు. లంబసింగితో పాటు చెరువులవేనం వ్యూపాయింట్ వద్ద పాల సముద్రాన్ని తలిపించే మంచు అందాలకు మురిసి సెల్ఫీలు, ఫోటోలు తీసుకొన, తాజంగి జలాశయం వద్ద జిప్ లైనర్ ఎక్కి, బోటు షికారు చేసి ఆనందంగా గడిపారు.

## విజృంభిస్తున్న చలి

గిరిజనుల అవస్థలు


చలిమంట వద్ద స్థానికులు

**డుంబ్రిగుడ:** మండలంలోని చలి పులి విజృంభిస్తుండడంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. శనివారం మండలంలోని 7 డిగ్రీల చలి నమోదు కాగా, ఆదివారం కూడా చలి తీవ్రత మరీంత ఎక్కువైనట్టు పలువురు చెప్పారు. చలిమంటను కాస్తూ గిరిజనులు సేదతీరారు.

**చలితో అప్రమత్తం**

చలికి గిరిజనులు చలి మంట కాస్తూ ఉన్న దుస్తులు, రగ్గులు కప్పుకుంటూ గ్రామమస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఉష్ణోగ్రతలు రోజురోజుకు పడిపోతుండడంతో గ్రామాల్లో గిరిజనులు చలి తీవ్రత ఎక్కువ ఉండటంలో తగిన జాగ్రతలు తీసుకోవాలని డుంబ్రిగుడ ప్రాథమిక వైద్యధికారి పి.రాంబాబు సూచిస్తున్నారు.


డుంబ్రిగుడలో కురుస్తున్న మంచులో రాకపోకలు సాగిస్తున్న గిరిజనులు

## క్లుప్తంగా

### తాగునీటి సమస్య పరిష్కరించాలని నిరసన


కొంత్రాయిగుడలో నిరసన తెలుపుతున్న గిరిజనులు

**అరకులోయటౌన్:** మండలంలోని బస్కీ పంచాయతీ కొంత్రాయిగుడలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ ఆదివారం గిరిజనులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం పంచాయతీ నాయకులు బాబూరావు, దేవన్న మాట్లాడారు. గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని , గతంలో అనేకమార్లు పోరాటం చేసినా, అధికారులకు విన్నవించినా నేటికి మంచి నీటి సమస్య పరిష్కరించాలన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని వారు కోరారు. గ్రామ మహిళలు పాల్గొన్నారు.

### నేటి నుంచి పశువైద్య శిబిరాలు


అప్పన్నబాబు

**గంగవరం:** గ్రామాల్లో పశు వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్టు నెల్లిపూడి గ్రామీణ పశు వైద్యశాల జూనియర్ వెటర్నరీ అధికారి పరిశిక అప్పన్నబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు పది రోజులు పాటు గంగవరం మండలంలో ప్రతీ గ్రామ పంచాయతీలో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. శిబిరాల్లో పశువులకు సాధారణ వ్యాధులకు, గర్భకోశ వ్యాధులకు చికిత్సతో పాటు లేగదూడలకు ఏటికపాముల నివారణకు, గొర్రెలు, మేకల్లో వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్టు చెప్పారు. గ్రామాల్లో నిర్వహించనున్న వైద్య శిబిరాలపై ముందస్తుగా సమాచారాన్ని తెలియజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పశు సంపద కలిగిన రైతులు వినియోగించుకోవాలని కోరారు.

### ఆదర్శ మహిళగా కృష్ణకుమారికి అవార్డు



అవార్డు అందుకుంటున్న కృష్ణకుమారి

**డుంబ్రిగుడ:** మండలానికి చెందిన మానవ హక్కుల నేర నిరోధక సంఘం రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు, ఆదివాసీ మహిళ కమ్మిడి కృష్ణకుమారికి ఆదర్శమహిళగా అవార్డు అందజేశారు. హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సీనీనటి కవిత, హైదరాబాద్ మున్సిపల్ కమిషనర్ చేతుల మీదుగ శారద ఎడ్యూకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో సౌత్ ఇండియా ఆదర్శ మహిళ-2025 అవార్డును అందజేసినట్టు కృష్ణకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో ఫోన్‌లో మాట్లాడుతూ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఏజెన్సీలో గిరిజనులకు చేస్తున్న సేవలకు గాను ఇటువంటి అవార్డు అందజేసిన శారద ఎడ్యూకేషనల్ సొసైటీ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

### రేషన్ కిట్లు పంపిణీ


పంచాయతీ పారిశుధ్య కార్మికులకు రేషన్ కిట్లు అందజేస్తున్న దాతలు

**రంపచోడవరం:** రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల సిరిగిందలపాడులో నారాయణసేవలో భాగంగా స్థానిక గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు రేషన్ కిట్లు పంపిణీ చేసినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. స్వామి వివేకానంద జయంతి వేడుకను ఆదివారం నిర్వహించారు. పంచాయతీలో పనిచేస్తున్న 17 మంది కార్మికులకు తొమ్మిది రకాల సరుకులతో కూడిన రేషన్ కిట్‌లను అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ తలారి వెంకటసుబ్బారావు, రాయుడు శ్రీనివాస్, సంపత్‌కుమార్, దాసరి ఉమా మహేష్, శానిటేషన్ కార్యదర్శి వీవీ సత్యనారాయణరెడ్డి, రామకృష్ణ మిషన్ మెడికల్ క్యాంప్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్, వలంటీట్లు సూర్య, పెద్ద అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



## వైఎస్సార్‌సీపీ నాయకుడు గోపాల్ మృతికి సంతాపం


శెట్టి గోపాల్ (ఫైల్)


మృతుడు గోపాల్ స్వగృహం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు

**అరకులోయటౌన్:** వైఎస్సార్‌సీపీ అరకులోయ మండల కార్యదర్శిగా పనిచేస్తున్న శెట్టి గోపాలరావు శనివారం రాత్రి విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. వైఎస్సార్‌సీపీకి గోపాలరావు ఎంతో సేవలందించారని, ఆయన మరణం పార్టీకి తీరని లోటని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. శెట్టి గోపాలరావు మృతికి అరకు ఎంపీ గుమ్మా తనూజారాణి, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు, ఉమ్మడి విశాఖ జిల్లా చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, మాజీ ఎమ్మెల్యేలు చెట్టి పాల్గుణ, శోభ హైమావతి దేవి, కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి, మాజీ జీసీసీ చైర్ పర్సన్ శోభ స్వాతిరాణి, అరకులోయ జెడ్పీటీసీ సభ్యురాలు శెట్టి రోషిణి, ఎంపీపీ రంజపల్లి ఉషారాణి, మండల పార్టీ అధ్యక్షుడు లొక్కోయి లక్ష్మణ కుమార్, అల్లూరి జిల్లా ఆదివాసీ ఏపీజీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్, కాంగ్రెస్ నాయకుడు శెట్టి గంగాధర స్వామి, ఏపీఎస్ ఆర్టీసీ విజయనగరం రిజన్ చైర్మన్ దొన్నుదొర తదితరులు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**నేడు మాదల గ్రామంలో అంత్యక్రియలు**

మృతుడు శెట్టి గోపాల్ అంత్యక్రియలను అరకులోయ మండలం మాదల పంచాయతీ కేంద్రంలో సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్టు గోపాల్ తండ్రి శెట్టి పండు తెలిపారు.

## ముగిసిన వాలీబాల్ టోర్నీ


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ రమేష్, నేతలు

**కొయ్యూరు:** లోకులగాంధీ స్మారకార్థం రెండు రోజుల పాటు కొండగోకిరిలో నిర్వహించిన వాలీబాల్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. మొత్తం 40 టీమ్‌లు పాల్గొన్న ఈ టోర్నీలో రేఖపల్లి జట్టు విజేతగా నిలిచింది. ద్వితీయ స్థానంలో నల్లగొండ, తృతీయ స్థానంలో బోయలగూడెం జట్లు నిలిచాయి. ఎంపీపీ బడుగు రమేష్, జనసేన అరకు పార్లమెంట్ కన్వీనర్ గంగులయ్య, జీసీసీ మాజీ చైర్మన్ ప్రసాద్‌ల చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి యువత లోకులగాంధీని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. టోర్నీ నిర్వాహకుడు మురళీకృష్ణను, సాయం అందించిన యువసైన్యంను అభినందించారు. జగన్నాథం, గొలుగొండ ఎంఈవో సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు గిరిబాబు, లోకుల కిరణ్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ముసిలినాయుడు, బీజేపీ నాయకుడు శివకుమర్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు దుస్తుల వితరణ


గిరిజన పేద కుటుంబాలకు వస్తువులు అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

**డుంబ్రిగుడ:** మండలంలోని యూటీఎఫ్ సహకారంతో భీమిలిపట్నం కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిరుపేద కుటుంబాల వృద్ధులకు చీరలు, రగ్గులు, టవల్స్, స్టీల్ బేసిన్లు, గ్లాసులు, స్టీల్ బాక్స్‌లు వితరణగా అందించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ కె.శ్రీరామచంద్ర మూర్తి మాట్లాడుతూ సంస్థ తరఫున ఏటా సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. గ్రామాల్లో యువత గంజాయి, మాదకద్రవ్యాల వంటి వాటికి దూరంగా ఉండాలని బాగా చదువుకోవాని కోరారు. యూటీఎఫ్ నేతలు మహేశ్వరరావు, బాబూరావు, కన్నయ, బాలకృష్ణ, పైడిరాజు, రాంబాబు, ఫౌండేషన్ సభ్యులు మూర్తి, భానుజీరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా గొట్టి పండగ


బూసులుకోటలో థింసా నృత్యం చేస్తున్న గిరిజన మహిళలు

**చింతపల్లి:** మండలంలో బూసులుకోట గ్రామంలో గొట్టి పండగను సంప్రదాయబద్ధంగా ఘనంగా నిర్వహించారు. అంజలి శనివారం పంచాయతీ పరిధిలో ఈ గ్రామంలో ఆదివారం ఈ పండుగ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి సంక్రాంతి పండుగ అనంతరం గ్రామ పెద్దలు గ్రామస్తులు అంతా కలసి ఈ గొట్టి పండుగను జరుపుకోవడం ఆనవాయితీ. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ముందుగా గ్రామంలో గల వినాయక ఆలయం వద్ద పూజలు నిర్వహిస్తారు. అనంతరం గ్రామంలో ఈ ఏడాది పశువులు కాపరి, గ్రామ బారికలను గ్రామ పెద్దలు సమక్షంలో ఎంపిక చేస్తారు. ఈ సందర్భంగా మహిళలు, చిన్నలు పెద్దలు థింసా నృత్యాలు, ఆట పాటలతో సందడి వాతావరణంలో గడిపారు. సర్పంచ్ రాజుబాబు, మాజీ సర్పంచ్ పోతురాజు, గ్రామ పెద్దలు నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

## నేడు మండల సమావేశం

**చింతపల్లి:** చింతపల్లి మండల సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. మండల ఎంపీపీ కోరాబు అనూషదేవి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలన్నారు.అదే విదంగా సర్పంచులు, ఎంపిటీసీలు, పంచాయతీ కార్యదర్శులు విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

## అధిక ధరలకు మద్యం విక్రయిస్తే చర్యలు

**కొయ్యూరు:** మండల కేంద్రంలోని ఓ మద్యం షాపులో ఎమ్మార్పీకి మించి మద్యం విక్రయించారన్న ఆరోపణపై చింతపల్లి ఎక్సైజ్ సీఐ కూర్మారావు, ఎస్ఐ శ్రావణి ఆదివారం సాయంత్రం విచారణ నిర్వహించారు. మద్యం కొనుగోలు చేసేందుకు వచ్చిన అనేకమందిని వారు ప్రశ్నించారు. ఎవరు కూడా ఎమ్మార్పీకి మించి మద్యం విక్రయించలేదని తెలిపారు. ఈ మేరకు కొందరు నుంచి వాంగ్మూలం కూడా తీసుకున్నారు. ఎక్సైజ్ సీఐ కూర్మారావు మాట్లాడుతూ ఎమ్మార్పీకి మించి మద్యం విక్రయిస్తున్నారన్న ఆరోపణలపై డీసీ ఆదేశాల మేరకు విచారణ చేపట్టామన్నారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. మద్యం దుకాణదారులు అధిక ధరలకు మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## గొడిచర్లలో పూరిల్లు దగ్ధం

**నక్కపల్లి:** గొడిచర్లలో ఆదివారం అగ్నిప్రమాదం సంభవించింది. కొండ్ర సత్యవతికి చెందిన పూరిల్లు దగ్ధమయింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో మంటలు వ్యాపించడంతో సర్వం బూడిదైనట్టు ఆమె వాపోయింది. కూలి పనులకు వెళ్లడంతో ప్రమాద విషయం చుట్టుపక్కల వారి ద్వారా తెలిసిందన్నారు. స్థానికులు మంటలను ఆర్పేలోపే ఇంట్లో దుస్తులు, వంట సామగ్రి, కిరాణా సరుకులు, మంచాలు, నగదు, ఆభరణాలు కాలిపోయాయన్నారు. బాధితురాలిని ఎంపీటీసీ సభ్యుడు నిట్ల గోవిందు పరామర్శించారు. ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

## అమిత్‌షా రాజీనామా చేయాలని డిమాండ్



బంగారమెట్టలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు



అరకులోయలో సీపీఎం నాయకులు నిరసన ర్యాలీ

**పాడేరు రూరల్:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్‌పై రాజ్యసభలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తు మండలంలో బంగారమెట్ట గ్రామంలో ఆదివారం సీపీఎం, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, సుందర్‌రావుల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ అంబేడ్కర్‌పై అనుచిత వాక్యాలు చేయాడం చాలా బాధాకరమన్నారు. అమిత్‌షాని తన పదవీ నుంచి బర్తరఫ్ చేయాలన్నారు, భారత ప్రజలందరికి అమిత్‌షా క్షమాపణ చెప్పి నైతిక బాధ్యత వహించలన్నారు. చంటిబాబు, రమేష్, బాలు, లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

**అరకులోయ టౌన్:** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్ షా తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కె.రామారావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అమిత్ షాను రాష్ట్ర ప్రభుత్వం ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. నేతలు జగన్నాథం, మగ్గన్న, బాలకృష్ణ, లైకోన్, రఘు తదితరులు పాల్గొన్నారు.

## కొరవడిన పారిశుధ్యం


పోర్టు అతిథి గృహం రహదారిలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

**అరకులోయటౌన్:** ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయలో రోజురోజుకు ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్ల పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు చెత్త చెదారాలు కుప్పలుగా ఎక్కడ చూసినా దర్శనమిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. పాడేరు -అరకు ప్రధాన రహదారిలో అంబేడ్కర్ జంక్షన్ నుంచి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి రహదారితో పాటు, తహసీల్దార్ క్వార్టర్ ఎదుట, అరకు-విశాఖ ప్రధాన రహదారి పోర్టు అతిథి గృహం, అల్లూరి సీతారామరాజు అతిథి గృహం సమీపంలో ప్లాస్టిక్ సంచులు, గ్లాసులు, ఇతర వ్యర్థాలు రోజుల తరబడి కుప్పలుగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. తీవ్ర దుర్గంధంతో సతమతమవుతున్నామని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

## ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు



**సాక్షి, పాడేరు:** పాడేరులో మోదకొండమ్మ జాతర సందర్భంగా ఆదివారం నిర్వహించిన ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. పోటీలను పాడేరు, అరకు ఎమ్మెల్యేలు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, రేగం మత్స్యలింగం పరిశీలించారు.